# స్వరమేళా

సీరియల్ లైట్లు వెలిగిపోతున్నై. గేటునిండా అవే, రకరకాలు. "వెల్‌కమ్" బోర్డు, రామరావణ యుద్ధం, మార్కండేయుడు, శివలింగం, యముడు, నక్షత్రం-స్వస్తిక్-సర్కిల్ ఒకేసారి అన్నీ వింత వింత ఆకృతుల్ని వెదజల్లు తున్నై.

గేటుకు అటూ, ఇటూ రెండు వరుసల్లో నాలుగు గజాల కొక ట్యూబ్‌లైట్ చొప్పున 24 ట్యూబ్‌లైట్లు-వసారా దాకా-బారులు తీరిన ప్రశ్నార్థకాల్లా నిలబడి ఉన్నై. వాటిని ఒకదానితో ఒకటి కలుపుతూ చిన్న లైట్ల తోరణాలు. వీటన్నిటి నడుమా రంగుల కాగితాల తోరణాలు, కాగితపు బుట్టలూ, మామిడి మండలా, బెలూన్ల గుత్తులు.

టౌను హాలు-కలవారి మిడిసి పాటుని ప్రదర్శిస్తోంది.

ఒక సాహిత్య సంస్థ తన పుట్టిన రోజుని జరుపుకుంటోంది.

నలుగురు తారలూ, ఒక వి.ఐ.పి, మరో నలుగురు హోదాగల కవులూ వస్తున్నారు.

జనం హడావిడీ: జనాన్ని అదుపుచేసే జనం హడావిడీ. ఏ పనీ లేని జనం బరాబరి-అన్నీ అవక్ర, పరాక్రమంతో సాగిపోతున్నై. కార్లు, జీపులూ తమ రొద తాము చేసి పోతున్నై.

"సాహిత్య సమావేశాలలో తొంభై శాతం ప్రేక్షకులూ, పదిశాతం శ్రోతలు" ఎవరో చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

టౌన్ హాలుకు ఎదురుగా రోడ్కు అవలి వైపు ఓ డాబా ఉంది. దాని ముందు ఓ షామియానా వెలిసింది. దాని క్రింద ఓ పాతిక ముప్పై కుర్చీలున్నై.

డాబా యింట్లో దీపాల కాంతిలో పండగ పరిమళాలు పరచుకుని వున్నై. పట్టుచీరల రెపరెపలు, పడుచు పిల్లల కలకలలూ, పరుగులూ-సంబరం మంచి పసందుగా కనిపిస్తోంది.

డాబా యిల్లు-మధ్యతరగతి మిథ్యా గౌరవాన్ని కాపాడుతోంది.

ఆ యింటి వారమ్మాయి పెద్దమనిషి అయిందట. ఇవాళ "ఫంక్షన్" ఏర్పాటు చేసుకున్నారు.

ఇక్కడ మైక్‌సెట్ తన పనికి ఉపక్రమించింది. మొట్ట మొదటి పాట- "దూర దేశమే గెదవో పెండ్లి కూతురా!" ఘంటసాల పాట పాడుతున్నాడు.

టౌన్ హాలులో మైక్‌సెట్ తన ఆధిక్యతని నిలుపుకోవాలని గొంతు సవరించుకుంది.

డాబా యింట్లో రెండో పాట-'కీచుకేచు...' 'కీచు కీచు...' 'కీచు కీచు'...ర్ర్....ర్ర్...చ్...చ్...చ్...చు...చ...చు...చ్చు...ర్ర్...చ్చ ...చ్చ....చ్చు...ర్ర్ లో పడింది. మరుక్షణంలో సర్దుకుని 'పిట్ట...'అంది. అంతలో రికార్డుకి మళ్ళీ నొప్పులుబయలు దేరినై. "ట్ట...ట్ట్...ట్ట్...ట్ట.. ర్ర్...ర్ర్... 'పిట్ట...పిట్ట'

టౌన్ హాల్లో పాట-పల్లవి "రిపీట్" అవుతూ "అహ ఒహో.." అంటోంది.

కొందరు ఉత్సాహవంతులు ఈలలు, శృతి చేసారు. నవ్వులు-

కేరింతలు.

భుజాల మీది చేతులు పక్కకు జారి చప్పట్లు చరుస్తున్నై.

రసస్ఫూర్తి కలిగిస్తూ-ఒక అరగంట గడిచింది.

టౌన్ హాల్ మైక్ గొంతు సవరించుకోసాగింది. "హలో... హలో...మైక్ టెస్టింగ్, ఒన్-టూ-త్రీ"-ఇత్యాది భజన-పది నిమిషాలు.

కార్లు విమ్మళంగా ఆవరణలోకి వచ్చి, స్పీడు పెంచుకుని లోపలి మెట్లదాకా పరిగెత్తి, అక్కడ పక్కకు తిరిగి, ఒకదాని వెంట ఒకటి "సర్రు"న ఆగినై.

"ఛీఫ్ గెస్ట్" లు దిగేరు.

పూలదండలు, ఫ్లాష్ క్లిక్‌లు-పరంపరగా మెరిసి వెలిగినై.

స్టేజి సర్దుకుంది. మైక్‌లో ఆహ్వానం అయింది.

దండలూ, క్లిక్‌లూ మరోసారి-పునఃపునఃగా-తమతో తాము కబుర్లాడుకున్నై.

దాబా యింట్లో మైక్ "వందనం...అభివందనం" అనసాగింది.

ఇంతలో ఒకరు హడావిడిగా టౌన్‌హాల్లో నుంచి బయటకొచ్చి, యింకొకరి చెవిలో ఏదో చెప్పి వెళ్ళిపోయారు.

ఆ ఇంకొకరు కాళ్ళలో కరెంట్‌ని ప్రవహింపజేసుకుంటూ దాబా యింట్లోకి పరిగెత్తుకొచ్చాడు. యజమాని ఎవరని ఆచూకీ తీశాడు.'ఒకరు' తనకు అందించిన సమాచారాన్ని చాలా సీరియస్‌గా చెప్పేడు-సదరు యజమానికి.

క్షణం తర్వాత మైక్ మూత బడింది.

టౌన్ హాల్లో మైక్ తన ఆడంబరాన్ని మరింతగా విజృంభించు కుంది.

వేద ఘోష ప్రారంభమయింది. కులవ్యవస్థకు గోరీ కట్టాలని

చాటి చెప్పిన స్వర్ణోత్సవ పాత్రని ధరించిన నటుడికి సన్మానం మొదలైంది.

అదే సినిమాలో "మీ ఆడంబరాలన్నీ కూకటి వ్రేళ్ళతో కూల ద్రోయబడే రోజు ఇంకా ఎంతో దూరంలో లేదు.", వంటి డైలాగులు చెప్పి జనం చేత చప్పట్లు కొట్టించుకున్న మరోతార-"అచలశ్రీ-" ఆ నటుడికి కనకాభిషేకం చేయసాగింది. నలభై వొక్కసారి ఫ్లాష్‌లు వెలిగినై-ఆ సీనులో.

స్టేజీ మీద చాలామంది ఆనంద బాష్పాలు చెమర్చారు.

కళ గురించి, సాహిత్యం గురించి, కళాపోషణ గురించీ, ఉపన్యాస పరంపర సాగిపోయింది.

సాహిత్య సంస్థ తాలూకు కార్యదర్శి నివేదిక చదువుతున్నాడు. శ్రోతల్లో కలకలం, ఈలలూ, పిల్లికూతలూ, 'అచలశ్రీ' గారు మాట్లాడాలని అరుపులూ.

"అచలశ్రీ" నిలబడ్డారు. "నాకు జనాన్ని చూస్తే కళ్ళు తిరుగుతై" అంది ఆమె.

"వొంతు లొత్తాయా?" అని ఎవరో అరిచారు.

ఆమెకు కోపం వచ్చింది. పళ్ళు కొరుక్కొని, పెదవులు బిగబట్టి, చేతులు వూపి, కాళ్ళ స్లిప్పర్స్‌తో నేలని తన్ని-టక్కున కూర్చుంది.

జనం ఆనంద సముద్రంలో ఈదు లాడుతున్నారు.

వి.ఐ.పి. కవిగారి ప్రసంగం మొదలైంది. వారు "ఓం"తో ప్రారంభించి, గురజాడ, వేమనల మీదుగా నడిచి, శ్రీశ్రీతో కరచాలనం చేస్తునట్లుగా సాగించి, స్టేజీ మీద ఉన్న మాటల రచయితనీ, పాటల రచయితనీ పలుకరించి-ఒకడు సూర్యుడూ-మరొకడు చంద్రుడూ అంటూ సెలవు తీసుకున్నారు.

కలక్షన్ కోసం వేసిన ప్రత్యేక సంచికనూ మరో ప్రత్యేక అతిథి

విడుదల చేశారు. వారి ప్రసంగం మొదలైంది. జనం కూడా తమ స్వరాల్ని కొంచెం తగ్గించారు.

డాబా యింట్లో మైక్ కొంచెం "పొజీషన్" మార్చుకుని రికార్డ్ లను విడుదల చేయసాగింది.

టౌన్ హాలుకు కుడిపైపు ప్రహరీగోడ ఉంది. దాని మీద నుంచి ప్రక్కగా పారుతున్న మురుగు కాల్వగట్టు మీదకి ఓ గుడిసె జార్చిఉంది.

ఇప్పుడు ఆ గుడిసెలో ఉన్నట్టుండి కలకలం బయల్దేరింది.

ఆ గుడిసెకీ ఆ యింట్లో ఉండే ఆడదానికీ-యజమాని మాంఛి మందు మీదున్నాడు. పెళ్ళాన్ని చావబాదేస్తున్నాడు.

అచలశ్రీ వయస్సుండి అవ్వలా తయారైన సదరు పెళ్ళాం "వాడ్ని" నానా బూతులు తిడుతూ వాడి దెబ్బలు తనకు మరింత తగిలేటట్టు అందు బాటులోకి వెళ్తోంది. మధ్య మధ్యలో ఏడుస్తోంది, పెడబొబ్బలు పెడు తోంది.

వాళ్ళ గారాలకూన-ఆరో ఏడున్న ఆరో సంతానం ఏడుపు మొహంతో-తల్లి కొంగు పట్టుకుని లాగుతూ, "ఆకలవుతా ఉందే" అని వెంటబడింది.

ఆ పిల్ల కళ్ళల్లో నీళ్ళు పేరుకొని పోయినై.

"ఛీ...దరిద్రపుముండా. ఆకలో ఆకలో అంటా ఏడిస్తే నేనెక్కడ తెచ్చేది. ఎట్టా సచ్చేది. నీళ్ళు తాగి అమూలచావు." అని నాలుగిచ్చుకుంది.

పిల్లది-అరున్నొక్క రాగం ఆరంభించింది.

డాబాయింట్లో వడ్డన మొదలవుతుంటే 'మైక్'-"శంకరాభరణమూ" ఎత్తుకుంది.!!

టౌన్ హాల్లో సంబరం లలిత సంగీత కచ్చేరీలోకి ప్రవేశించింది ప్పుడు..."శివరంజనీ..." మొదలైంది!!

పిల్లది ఆలాపిస్తున్న "కుండలో నీళ్ళు కూడా లెయ్యే" అన్న "ముఖారి" వీటన్నిటి మధ్యా పెగిలి రాలేదు!!

"ఈ పుస్తకం చదివి ఇవ్వు. బాగుంటుంది" అని తన చేతిలోని పుస్తకాన్ని నాకిచ్చి వెళ్ళిపోయాడు నా మిత్రుడు.

అదొక ఉర్దూ నవల.

పేరు చూశాను-"ఔర్ ఇన్సాన్ మర్‌గయా."